శేరిలింగంపల్లి.. ఏడు లక్షల ఓట్లు

14 ఏళ్లలో రాష్ట్రంలోనే అతి పెద్ద నియోజకవర్గంగా ఆవిర్భావం

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నాడు ఓ గ్రామ పంచాయితీ. రాజేంద్రనగర్ సమితిలో భాగంగా ఉన్న శేరిలింగంపల్లిని 1987లో మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. 13 గ్రామ పంచాయతీలు. 7 హమ్లేట్ విలేజ్‌లతో మున్సిపాలిటీగా శేరిలింగంపల్లి ఆవిర్భవించింది. 2005లో మున్సిపల్ రద్దు కావడంతో మూడేళ్ల పాటు ప్రత్యేక అధికారి పాలనలోనే ఉంది. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేశారు. అప్పటి వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అతి పెద్ద నియోజకవర్గంగా ఖైరతాబాద్ ఉండేది. దేశంలో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ఖైరతాబాద్ నుంచి శేరిలింగంపల్లి నియోజకవర్గంగా విభజించారు. శేరిలింగంపల్లి మండలంతో పాటు కూకట్‌పల్లి మండల పరిధిలోని హైదర్‌నగర్, వివేకానందనగర్, ఆల్విన్ కాలనీలను కలిపి శేరిలింగంపల్లి నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు.

సం,,	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
2009	3,80,856	2,02978	1,77,874	4
2014	5,91,259	3,24,731	2,66,441	87
2018	5,75,542	3,07,343	2,68,061	138
2023	6,98,133	3,70,301	3,27,636	142

తొలి ఎమ్మెల్యే ఎం.భిక్షపతి యాదవ్

- మున్సిపల్‌గా ఖైరతాబాద్ నియోజకవర్గంలో అంతర్భాగంగా ఉన్న శేరిలింగంపల్లికి 2009లో నియోజకవర్గం హోదా దక్కింది.
- వైఎస్సార్ ఆశీస్సులతో సాధారణ ఎన్నికలో తొలి ఎమ్మెల్యేగా మారబోయిన భిక్షపతి యాదవ్ గెలుపొందారు.
- 1,327 ఓట్ల స్వల్ప మెజారిటీతో టీడీపీ అభ్యర్థి మొవ్వా సత్యనారాయణపై గెలుపొందారు.
- 2009 అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల వారీగా వచ్చిన ఓట్లు...

1.ఎం.భిక్షపతియాదవ్(కాంగ్రెస్) : 61,135 ఓట్లు
2. మొవ్వా సత్యనారాయణ(టీడీపీ) : 59,808 ఓట్లు

2014 ఎన్నికల వివరాలు..

- 2014లో సాధారణ ఎన్నికల్లో టీడీపీ, టీఆర్ఎస్ అభ్యర్థుల మధ్య పోటీ సాగింది.
- టీడీపీ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ 76,257 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు.
- ఆరెకపూడి గాంధీకి 1,29,796 ఓట్లు రాగా, టీఆర్ఎస్ అభ్యర్థి కొమరగోని శంకర్ గౌడ్‌కు 53,539 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి ఎం.భిక్షపతి యాదవ్‌కు 43,196 ఓట్లు వచ్చాయి.

1. టీడీపీ: ఆరెకపూడి గాంధీకి : 1,29,796
2. టీఆర్ఎస్ కొమరగోని శంకర్ గౌడ్ :53,539
3. కాంగ్రెస్ ఎం.భిక్షపతి యాదవ్ 43,196

2023లో రాష్ట్రంలోనే పెద్ద నియోజకవర్గంగా..

- ఎన్నికల సంఘం తాజాగా వెల్లడించిన జాబితాలో శేరిలింగంపల్లి నియోజకవర్గం అతి పెద్దదిగా అవతరించింది.
- అక్టోబర్ 4న తుది ఓటరు జాబితలో 6,98,079 ఓటర్ల సంఖ్యను నిర్ధారించింది.
- ఐదు ఏళ్లలో దాదాపు 1.25 లక్షల ఓట్లు పెరగడం గమనార్హం.
- కొత్తగా నమోదు చేసుకున్న ఓటర్లను పరిగణనలోకి తీసుకుంటే ఓటర్ల సంఖ్య ఏడు లక్షలు దాటుతుందని ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు.
- నియోజకవర్గంలో మొత్తం పోలింగ్ స్టేషన్లు 622, పోలింగ్ లోకేషన్లు 197 ఉన్నాయి.

2018 ఎన్నికల వివరాలు...


శేరిలింగంపల్లి మొదటి ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్


రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థి గాంధీ

- 2018లో జరిగిన ముందస్తు ఎన్నికలలో టీఆర్ఎస్‌తో కాంగ్రెస్, టీడీపీ కూటమి మధ్య హోరాహోరీగా జరిగాయి.
- టీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీకి 1,43,005 ఓట్లు రాగా టీడీపీ అభ్యర్థి వి.ఆనంద్ ప్రసాద్‌కు 98,811 ఓట్లు వచ్చాయి.
- 44,194 ఓట్ల భారీ మెజారిటీలో గాంధీ రెండో సారి ఘన విజయం సాధించారు.బీజేపీ అభ్యర్థి గజ్జెల యోగానంద్ కేవలం 22,073 ఓట్లతో సరి పెట్టుకోవాల్సి వచ్చింది.


శేరిలింగంపల్లి నియోజకవర్గం మ్యాప్

లక్ష ఓట్లు తొలగింపు...

- 2018 ఎన్నికలకు ముందు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో లక్షకు పైగా ఓట్లను తొలగించారు. బోగస్ ఓట్లు, రెండుచోట్ల ఉన్న ఓట్లు, నియోజకవర్గం విడిచి వెళ్లిన వారి ఓట్లను భారీ సంఖ్యలో తొలగించారు. -2014లో ఓట్లు 5,91,259 ఉండగా 2018 నాటికి ఓట్ల సంఖ్య 5,75,542కు తగ్గడం గమనార్హం. ఐటీ ఉద్యోగులు, వలస ఓటర్లు ఎక్కువగా ఉండటం దీనికి కారణంగా చెప్పవచ్చు. ఓట్ల తొలగింపు ప్రక్రియ అప్పట్లో తీవ్ర దుమారం రేపింది.

ఆయా పార్టీల అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

1. టీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ : 1,43,005
2. టీడీపీ అభ్యర్థి వి.ఆనంద్ ప్రసాద్ : 98,811
3. బీజేపీ అభ్యర్థి గజ్జెల యోగానంద్ : 22,073

అభివృద్ధి శిలాఫలకాలకే పరిమితం

మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి


మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి, నియోజకవర్గం కన్వీనర్ రాఘవేంద్రరావు

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలో అభివృద్ధి శిలాఫలకాలకే పరిమితమైందని, దీనిపై ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ చర్చకు రావాలని మాజీ కార్పొరేటర్, బీజేపీ నాయకురాలు బొబ్బ నవతారెడ్డి కోరారు. బుధవారం డివిజన్ పరిధిలోని విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ రాఘవేంద్రరావుతో కలిసి ఆమె మాట్లాడుతూ గత 5 సంవత్సరాలలో 2018- 2023 వరకు ఎమ్మెల్యే సీడీపీ ఫండ్స్ ద్వారా మొత్తం 69 పనులు మంజూరు కాగా, వాటిలో 19 పనులకు నిధులు మంజూరవగా 14 పనులు పూర్తి చేశారన్నారు. 36 పనులకు నిధులే విడుదల కాలేదన్నారు. సీడీపీ ఫండ్స్ ద్వారా రూ.28 కోట్ల అభివృద్ధి పనులు చేశానని చెప్పిన ఎమ్మెల్యే, గత 5 సంవత్సరాలలో కేవలం సీడీపీ ఫండ్స్ ద్వారా కోటి రూపాయలు మాత్రమేనని ఆర్టీఐ ద్వారా తెలుసుకున్నానన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఎగ్జిక్యూటివ్ త్రినాథ్, అనంత్‌రెడ్డి, నాయకులు చందర్‌రావు, గౌస్, కృష్ణ దాస్, మల్లేష్, రమణ కుమారి పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి టికెట్‌ను యోగానంద్‌కు కేటాయించాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డిని కలిసిన ఆర్యవైశ్య సంఘాలు


కిషన్‌రెడ్డిని కలిసిన యోగానంద్, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి టికెట్‌ను యోగానంద్‌కు కేటాయించాలని ఆర్యవైశ్య సంఘాలు బుధవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో అతి పెద్ద నియోజకవర్గమైన శేరిలింగంపల్లిలో 60 వేల జనాభా కల్గిన ఆర్యవైశ్యులతో పాటు ఇతర వర్గాల వారు ఆర్య వైశ్యుడైన గజ్జెల యోగానంద్‌కు మద్దతుగా నిలుస్తారని పేర్కొన్నారు. యోగానంద్ మీ సమస్య-మా పోరాటం అనే నినాదంతో ప్రజా సమస్యలపై పోరాడుతున్నారని వివరించారు. అలాగే డాక్టర్ లక్ష్మణ్, ఈటల రాజేందర్‌ను కలిశారు.

బీసీలు సంఘటితం కావాలి

- బీసీ ఐక్యవేదిక చైర్మన్ భేరి రాంచందర్‌యాదవ్


జగదీశ్వర్‌గౌడ్‌ను సత్కరిస్తున్న బీసీ ఐక్యవేదిక ప్రతినిధులు

శేరిలింగంపల్లి: బీసీ నాయకులంతా సంఘటితం కావాలని బీసీ ఐక్యవేదిక చైర్మన్ భేరి రాంచందర్ యాదవ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన జగదీశ్వర్‌గౌడ్‌ను బీసీ ఐక్యవేదిక నాయకులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బీసీలకే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని, అందుకు జగదీశ్వర్‌గౌడ్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు.కార్యక్రమంలో బీసీ నాయకులు సాయన్న, రమేష్, నర్సింగ్‌ముదిరాజ్, నర్సింహులు, రామకృష్ణగౌడ్, వెంకటమ్మ, నాగరాజు, నర్సింహ్మయాదవ్, కమాల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలి..

గచ్చిబౌలి: కాంగ్రెస్ పార్టీకి ప్రజలంతా అండగా నిలవాలని, భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రఘునాథ్‌యాదవ్ కోరారు. కొండాపూర్ డివిజన్ అంజయ్యనగర్, సిద్ధిఖ్‌నగర్‌లో గడపగడపకూ రఘున్న కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు సామాన్యులకు అందనున్నామన్నారు. ఒక్కో వర్గానికి సంబంధించి ఒక్కో ప్రధానాంశాన్ని ఆ గ్యారంటీల్లో చేర్చడం జరిగిందన్నారు. ఒక్కసారి అవకాశం కల్పిస్తే శేరిలింగంపల్లిలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామన్నారు. కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అంజయ్యనగర్, సిద్ధిఖీనగర్‌లో పాదయాత్రలో రఘునాథ్‌యాదవ్

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం


ప్రచారంలో మాట్లాడుతున్న శ్యామలాదేవి

మియాపూర్ : ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యే గాంధీని అఖండ మెజార్టీతో గెలిపించుకుందామని ఆయన సతీమణి శ్యామలాదేవి అన్నారు. బుధవారం మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ ప్రశాంత్‌నగర్, రాఘవేంద్ర పాంచజన్య, అపార్ట్‌మెంట్, కృషినగర్, లక్ష్మీ, మందాడి అపార్ట్‌మెంట్‌లలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ సతీమణి సుమలత, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలతో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళా పక్షపాతి అని మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. పార్టీ విజయం తథ్యం అన్నారు. కార్యక్రమంలో కిరణ్, చంద్రిక ప్రసాద్, రోజా, సుప్రజ, ఉచ్చిబాబు, పృథ్వీ, రాధిక, ప్రణీత, కుమార్, యుగందర్, రజిని, శ్యామల, కల్పన పాల్గొన్నారు.

రాత్రి 11గంటల లోపు షాపులు మూసివేయాలి

మాదాపూర్ ఏసీపీ శ్రీనివాస్

గచ్చిబౌలి: రాత్రివేళ అన్ని దుకాణాలు 11 గంటలలోపే మూసివేయాలని మాదాపూర్ ఏసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. గచ్చిబౌలి డీఎల్ఎఫ్ ప్రాంతం, మాదాపూర్, రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్ట్రీట్ వెండర్స్‌తో గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలని సూచించారు. రాత్రివేళ తనిఖీలు ఉంటాయని చెప్పారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు, సబ్ ఇన్‌స్పెక్టర్లు శోభన్‌బాబు, భానుప్రసాద్, రాజశేఖర్‌రెడ్డి, పోలీసులు, స్ట్రీట్ వెండర్లు పాల్గొన్నారు.


పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్ పాపారావు, అధ్యాపకులు

క్రీడా విజేతలకు సత్కారం

రాయదుర్గం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించడం గర్వంగా ఉందని గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ఐఐటీ, మెడికల్ అకాడమీ ప్రిన్సిపల్ పాపారావు పేర్కొన్నారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఇటీవల చిల్కూరు కళాశాలలో రాష్ట్ర స్థాయి 9వ జోనల్ స్పోర్ట్స్ మీట్-2023 లో వేర్వేరు విభాగాల్లో గౌలిదొడ్డిలోని ఐఐటీ, నీట్ అకాడమీ విద్యార్థులు రాణించారు. వరుసగా అండర్-19 చెస్ పోటీల్లో సీనియర్ ఎంపీసీ నుంచి ఆశీర్వాద్, అథ్లెటిక్స్ విభాగంలో జూనియర్ నుంచి ఎన్ హర్షవర్ధన్, స్వర్ణపతకాలు సాధించారు. హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, లాంగ్‌జంప్ విభాగంలో రజిత పతకాలు సాధించారు.

గెలుపునకు సమష్టిగా కృషి చేయాలి

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని బీఆర్‌యస్ పార్టీ మహిళా నాయకురాళ్లు, డివిజన్, అనుబంధ కమిటీ సభ్యులతో బుధవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. శేరిలింగంపల్లి శాసనసభ్యులు గాంధీకి భారీ మెజార్టీ వచ్చేలా కృషి చేయాలని కోరారు. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గాంధీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. డివిజన్ పార్టీ అధ్యక్షుడు సమ్మారెడ్డి, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

20న హెచ్‌సీయూలో జాతీయ సదస్సు

రాయదుర్గం: ప్రముఖ కవి గుంటూరు శేషేంద్ర శర్మ జయంతిని పురస్కరించుకొని ఈనెల 20వ తేదీన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ఒకరోజు సదస్సును నిర్వహించనున్నట్లు సదస్సు సమన్వయకర్తలు తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య పమ్మి పవన్ బుధవారం తెలిపారు. 'గుంటూరు శేషేంద్రశర్మ రచనలు-సమాలోచన' పేరుతో హెచ్‌సీయూ మానవీయ శాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఓరియంటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఆచార్య పిసి వెంకటేశ్వర్లు, యోగి వేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్ ఈశ్వర్‌రెడ్డి, సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య తాడేపల్లి పతంజలి, ఎస్వీ డిగ్రీ ప్రభుత్వ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ భారతి, ఆచార్య పిల్లలమర్రి రాములు, ఆచార్య గోనానాయక్, డాక్టర్ భూక్య తిరుపతి తదితరులు తమ పరిశోధనా పత్రాలను సమర్పిస్తారని వివరించారు.

ఫర్నిచర్ షోరూం ప్రారంభం

గచ్చిబౌలి: లగ్జరీ బ్రాండ్ రెస్టీ ఫర్నిచర్ నగర వాసులకు అందుబాటులోకి వచ్చిందని ఎండి జయచంద్ర తెలిపారు. బుధవారం గచ్చిబౌలిలో దేశంలోనే ఏడో స్టోర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జయచంద్ర మాట్లాడుతూ అభిరుచికి తగ్గట్లు వివిధ రకాల డిజైన్లు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో హెడ్ స్టూడియో నిర్వాహకులు ప్రమోద్ కేసాని, సరిత పాల్గొన్నారు.

మియాపూర్‌లో 'రతన్ ఎయిర్ కండిషనర్స్'..

మియాపూర్ : మియాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డైకిన్ షోరూమ్ రతన్ ఎయిర్ కండిషనర్స్ సర్వీసెస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కన్వల్జీత్ ప్రారంభించారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్, సుమన్‌కుమార్, ఎండి.రతన్, ఎయిర్ కండిషనర్స్ డైకిన్ రీజనల్ డైరెక్టర్ ఎస్.కే కావ్య తదితరులు పాల్గొన్నారు.

మనూలో 'ధనక్‌బజార్ ఎగ్జిబిషన్'

రాయదుర్గం: మహిళా వ్యాపారవేత్తలు ఉత్పత్తులు 'ధనక్‌బజార్ ఎగ్జిబిషన్' ఆకట్టుకుంది. మనూ క్యాంపస్‌లో 'మనూ' లేడీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'సఫా' ఎన్‌జీఓ పర్యవేక్షణలో ఏర్పాటైన ధనక్‌బజార్‌ను వీసీ ఐనుల్‌హసన్ చేతుల మీదుగా ప్రారంభించారు. వ్యాపారంలో మహిళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, 'మనూ' లేడీస్ అసోసియేషన్ అధ్యక్షురాలు అర్షియాహసన్, ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ షాహిదా తదితరులు పాల్గొన్నారు.

లింగంపల్లిలో రూ.18 లక్షలు సీజ్

హఫీజ్‌పేట్ : గుల్‌మొహర్ పార్కు సమీపంలో బుధవారం రాత్రి 7.30 గంటలకు చందానగర్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రఘు వాహనాల తనిఖీ చేస్తుండగా కారులో రూ.18 లక్షలు ఉన్నాయి. డబ్బుకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం సీజ్ చేసిన డబ్బును ఎన్నికల అధికారులకు అప్పగిస్తామని తెలిపారు.

కాలనీ, బస్తీలను అభివృద్ధి చేసి చూపిస్తాం...

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్
- గడపగడపకు బీజేపీ రవన్న ప్రజాయాత్ర


పాపిరెడ్డి కాలనీలో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్న రవికుమార్ యాదవ్

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రతి కాలనీ, బస్తీలను అభివృద్ధి చేసి చూపిస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం చందానగర్ పాపిరెడ్డి కాలనీలో గడపగడపకు బీజేపీ రవన్న ప్రజా యాత్ర 102వ రోజు ఇంటింటికి తిరుగుతూ కరపత్రాల ద్వారా బీజేపీ చేసిన అభివృద్ధిని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపిరెడ్డి కాలనీలో డ్రైనేజీ, రోడ్లు, పార్కు, మంజీరా పైప్‌లైన్లు, ఇళ్లపట్టాలు, స్ట్రీట్ లైట్స్ వంటి అభివృద్ధి మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ చేసిందేనని అన్నారు. నేడు ఎమ్మెల్యే గాంధీ కేవలం కబ్జాలు, శంకుస్థాపనలు మాత్రమే చేశారన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇష్టానుసారంగా ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఈసారి బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అనిల్‌కుమార్ యాదవ్, రమేష్, నరసింహ, శ్రీశైలం, విజయలక్ష్మి, శ్రీను, విజయ్, నరసింగ్ యాదవ్, ఇమ్రాన్, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రతీక అమీన్‌పూర్

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడంతో పాటు సుమారు 200 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు.బుధవారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కెఎస్ఆర్ కాలనీలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించాలని లక్ష్యంతో మూడు బస్తీ దవాఖనాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం సైతం మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో బిందెడు నీటి కోసం రోజుల తరబడి వేచి చూసే పరిస్థితుల నుండి రోజు ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందిస్తున్న ఘనత కేవలం బీఆర్ఎస్‌కే దక్కిందన్నారు.అనంతరం బీరంగూడ గోశాలలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన..

అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడ గ్రామ పరిధిలోని బీఎస్ఆర్ కాలనీలో బుధవారం నూతనంగా నిర్మించిన శివాలయం, హనుమాన్, వినాయక ఆలయాల్లో ఏర్పాటు చేసిన విగ్రహ ప్రతిష్ఠాపనల కార్యక్రమానికి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆత్మీయ సన్మానం చేశారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, ఆయా వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన సంకీర్తనలు



మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న నాద బ్రహ్మోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం డాక్టర్ శోభరాజు శిష్యబృందం శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రమ్, శ్రీలక్ష్మీ అష్టోత్తర శతనామ స్తోత్రమ్ ,గురుస్తుతితో అలరించారు. ప్రముఖ నేపథ్య గాయని మానస ఆచార్య సంకీర్తనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ పాల్గొన్నారు.

శిల్పారామంలో దాండియా.. బతుకమ్మ

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో దాండియా ఆటలతో సందర్శకులు సరదాగా గడిపారు. దసరా, బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా బుధవారం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా గురువు సాయికృష్ణ తాడేపల్లి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. దేవిస్తుతి వైభవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఆర్తిశంకర్ శిష్యబృందం గణేశ్‌వందన, తీన్తాల్, తరణ, దుర్గ, శ్రీరామ తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. బంగ్లాదేశ్‌కి చెందిన ప్రముఖ పాత్రికేయులు, ఎడిటర్లు శిల్పారామాన్ని సందర్శించారు. అనంతరం ఇక్కడి సంస్కృతి సాంప్రదాయాల గురించి అడిగి తెలుసుకున్నారు.



ఉత్సవాలు.. ప్రత్యేక అలంకారాలు


లలితాదేవిగా రాజరాజేశ్వరీమాత


శివసాయిక్షేత్రంలో..

రాయదుర్గం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజ రాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు లలితాదేవిగా దర్శనం ఇచ్చారు.

- గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో అన్నపూర్ణాదేవికి ఆలయంలో అర్చనలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. రాజరాజేశ్వరిమాతగా అలంకరించారు.
- కొండాపూర్‌లోని కట్టమైసమ్మ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీ అమ్మవారిగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు గౌతమాచార్య పర్యవేక్షణలో కరెన్సీ నోట్లతో అలంకరించారు. అనంతరం ఆలయంలో సామూహిక కుంకుమార్చన చేశారు. -
- భారతీనగర్ డివిజన్ ఎంఐజీ కాలనీలో పోచమ్మ ఆలయంలో మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, నాగమణి ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో కార్పొరేటర్ సింధూ ఆదర్శరెడ్డి, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పానగేష్‌యాదవ్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ఎమ్మెల్యే

హఫీజ్‌పేట్ : శరన్నవరాత్రులను పురస్కరించుకొని బుధవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీలో ఎమ్మెల్యే గాంధీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు హరిష్, గౌతమ్‌గౌడ్, లక్ష్మారెడ్డి, రవీందర్ రెడ్డి, వెంకటేశ్వరావు, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.


ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీలో .. అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే గాంధీ


భెల్ ఎంఐజీ కాలనీలో.. కార్పొరేటర్లు సింధు, పుష్ప తదితరులు